ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 7 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

గురువారం 2 అక్టోబరు 2025



కదిరిలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

నేడే దసరా

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

పుట్టపర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హిందువుల ప్రధాన పండుగల్లో ఒకటైన దసరాను గురువారం ఘనంగా చేసుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని రోజుకొక అలంకారంలో పూజించారు. గురువారం విజయ దశమి సందర్భంగా ఆలయాలకు భక్తులకు పోటెత్తనున్నారు. దీంతో ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పండుగ నేపథ్యంలో బుధవారం సరుకులు, పూజాసామగ్రి, పూలు, పండ్ల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఆయుధ పూజలు ఘనంగా చేసుకున్నారు.

కొనసాగిన యజ్ఞం

పుట్టపర్తి (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కాంక్షిస్తూ స్థానిక ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర హాల్‌లో చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం బుధవారం ఆరో రోజు కొనసాగింది. వేదపడివండితులు వేదమంత్రాలతో యజ్ఞం చేశారు. గణపతిపూజతో మొదలు పెట్టి త్రిమూర్తుల పూజ, మహాలక్ష్మి, దుర్గతోపాటు సర్వదేవతార్చన నిర్వహించారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో బృందావనం క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



కచేరి నిర్వహిస్తున్న విద్యార్థులు

అందరికీ విజయాలు చేకూరాలి

● జిల్లా ప్రజలకు ఎస్పీ దసరా శుభాకాంక్షలు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బంది, ఆనందంగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన జిల్లా ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాపోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమానికి ఎస్పీ దంపతు లు ముఖ్యఅతిథిలుగా హాజరై పూజలు నిర్వహించారు. దుర్గాదేవి చిత్రపటానికి పోలీసులు ఉపయోగించే ఆయుధాలకు శాస్త్రోత్తంగా పూజలు నిర్వహిచారు. ఎస్పీ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగ అందరికి విజయాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీసీఐ వెంకటేశ్వర్లు, సీఐలు ,ఎస్సైలు, ఏఆర్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచే శిక్షణ

● హాజరుకానున్న 1,476 మంది కొత్త టీచర్లు

8

వైసీపీ అడ్డంకులను ఛేదించి డీఎస్సీ పూర్తి

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కొత్త టీచర్లతో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 105 కేసులు పెట్టినా.. వాటన్నింటిని ఛేదించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ పూర్తి చేశారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గంలో డీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన 70 మంది కొత్త టీచర్లను మంత్రి సవిత సన్మానించారు. అనంతరం కేక్‌కట్‌చేసి వారితో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేసి మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. విద్యవిలువ తెలిసిన నేత లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో డీఎస్సీ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి నాణ్యమైన శిక్షణ ఇచ్చామన్నారు. బీసీ కోచింగ్ సెంటర్లలో 6వేల మంది కోచింగ్ తీసుకున్నారని, అందులో 281 మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఈ కోచింగ్ సెంటర్ ఉంటుందన్నారు. డీఎస్సీ అంటే టీడీపీ, టీడీపీ అంటే డీఎస్సీ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, బాలకృష్ణచౌదరి, శ్రీనివాసులు, మంజునాథ్, త్రివేంద్ర పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి అలంకరణలో ఖాద్రీశుడు



కదిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బుధవారం వెంకటేశ్వర స్వామి అలంకరణల భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం వెంకటేశ్వరస్వామి అలంకరణలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు వెంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలి

అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్

బుక్కపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతి కుటుంబానికి అందించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తేరుకూడలిలో నిర్వహించిన సూపర్‌జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీఎస్టీలో స్లాబ్‌లు తగ్గింపు కారణంగా ప్రజలు నిత్యం ఉపయోగించే టూత్‌పేస్ట్ నుంచి ఏసీ వరకు, రైతులు ఉపయోగించే సాగు పరికరాల నుంచి ట్రాక్టర్ వరకు ధరలు గణనీయంగా తగ్గాయని అన్నారు. పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. జీఎస్టీ స్లాబుల తగ్గింపు ద్వారా ప్రభుత్వం కోట్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికి.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం వ్యాపార దుకాణాలను సందర్శించి జీఎస్టీ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామూనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ జబ్బీర్‌బాషా, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ గోపాల్‌నాయక్, జీఎస్టీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యరాజు, ఏఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో జీఎస్టీ సంస్కరణల గురించి వివరిస్తున్న కలెక్టర్

పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద బుధవారం కలెక్టర్ శ్యాంప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2,63,987 మంది పింఛన్‌దారులకు రూ.115.54 కోట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. 2వతేదీ దసరా పండుగ కావడంతో మిగిలిపోయిన వారికి 3న పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.



రైతన్నకు చోర భయం

● అన్నదాతలు, ట్రాన్స్‌కోకు తీవ్ర నష్టం

● వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న దొంగలు

తలుపుల సమీపాన దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

(వివరాలు 9లో..)

అయ్యో.. రామక్రిష్ణా..!

● గురుకుల ప్రిన్సిపాల్‌గా ఎంపిక.. తుది జాబితాలో పేరు

● ఆలస్యంగా గుర్తింపు..

● డీఈఓ కార్యాలయానికి పరుగు

(వివరాలు 8లో...)

15 దాకా ఈ పంట నమోదు గడువు

(వివరాలు 8లో...)

అయ్యో.. రామక్రిష్ణా..!

- గురుకుల ప్రిన్సిపాల్‌గా ఎంపిక.. తుది జాబితాలో పేరు
- ఆలస్యంగా గుర్తింపు..
- డీఈఓ కార్యాలయానికి పరుగు



తుది జాబితాలో తన పేరు చూపుతున్న రామక్రిష్ణ

అనంతపురం విద్య, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలలో విద్యాశాఖ తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. రామక్రిష్ణ అనే వ్యక్తి ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా కూడేరు మండలంలో పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ-2025 నియామకాలలో మోడల్ స్కూల్స్, గురుకులాల ప్రిన్సిపాల్ పోస్టుకు వీహెచ్ (అంధత్వం) కేటగిరి కింద దరఖాస్తు చేసుకొని పరీక్ష రాశారు. రాష్ట్రస్థాయిలో 573వ ర్యాంకులో నిలిచారు. వీహెచ్ కోటా కింద మోడల్ స్కూల్స్‌లో ప్రిన్సిపాల్ పోస్టు వస్తుందని ఆశించారు. ఆ పోస్టు జాబితా మాత్రమే చూసుకుంటూ ఇతర యాజమాన్యం ప్రిన్సిపాల్ పోస్టుల గురించి ఆలోచించలేదు. రామక్రిష్ణ వీహెచ్ కోటా కింద రాష్ట్రస్థాయిలో గురుకులాల (ఏపీఆర్ఈఐఎస్) ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికైనట్లు రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన తుది జాబితాలో పేరు ఉంది. వేరే జిల్లాకు చెందిన ఆయన మిత్రుడు ప్రిన్సిపాల్‌గా ఎంపికయినా వెరిఫికేషన్‌కు ఎందుకు రాలేదని అడిగారు. అపుడు రామక్రిష్ణ ఎంపిక జాబితాను చూసుకున్నాడు. అందులో తుది ఎంపిక జాబితాలో తనపేరు ఉండడంతో ఖంగుతిని బుధవారం డీఈఓ కార్యాలయానికి పరుగున వచ్చారు. ఇక్కడి డీఎస్సీ సెక్షన్‌లో అధికారులను కలిసి తాను ఎంపికైనట్లు ఎలాంటి సమాచారం రాలేదని, తనకు జరిగిన అన్యాయం వివరించాడు. తనకు న్యాయం చేయాలని, లేదంటే తనకు ఎలాగో ఉద్యోగం ఉందని, అర్హత ఉన్న ఇంకో అభ్యర్థికయినా ఆ పోస్టు ఇవ్వాలని కోరారు. ఇది రాష్ట్రస్థాయి పోస్టు అని, ఈ పోస్టు ఎంపిక రాష్ట్ర స్థాయిలోనే జరిగిందని, అక్కడికే వెళ్లి కలవాలని విద్యాశాఖ అధికారులు ఉచిత సలహా ఇచ్చి పంపించారు. ఇప్పటికే నియామకాల ప్రక్రియ ముగిసింది. 3వ తేదీ నుంచి కొత్తటీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇపుడు ఈయన గోడు వినేదెవరు.. అంటూ అక్కడ ఉన్నవారు అయ్యో .. రామక్రిష్ణా.. అని సానుభూతి తెలిపారు.



పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం





కిక్కిరిసిన జనంతో పాతూరులోని ఓ వీధిలో స్తంభించిన ట్రాఫిక్

నేడే విజయదశమి

కిటకిటలాడనున్న అమ్మవారి ఆలయాలు



అనంతపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విజయదశమి పండుగను గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే పండుగ కావడంతో గత పది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, పూజించారు. పండుగ నేపథ్యంలో పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు బుధవారం కిటకిటలాడాయి. అలాగే ప్రజల షాపింగ్‌లతో అనంతపురం నగరంలో సందడి నెలకొంది. పూలు, పండ్లు, మామిడాకులు, టెంకాయలు, అరటి పిలకలు తదితర సామగ్రి కోనుగోళ్ల నేపథ్యంలో పాతూరు, క్లాక్‌టవర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఆయుధపూజ సందర్భంగా బుధవారం ఉదయం వాహనాలు, యంత్రాలతోపాటు వ్యవసాయ పరికరాలకూ పూజలు నిర్వహించారు. విజయదశమి నేపథ్యంలో నేడు అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడనున్నాయి.

ఏడేళ్లకే అంతర్జాతీయ ర్యాంకు



రతన్‌తేజ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల వయసులోనే తాడిపత్రికి చెందిన రతన్‌తేజ్ అంతర్జాతీయ స్థాయి చెస్‌లో ర్యాంకు సాధించాడు. గత రెండేళ్లుగా చెస్ ఆడుతున్న రతన్‌తేజ్ ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ విభాగంలో అండర్-17 బాలుర కేటగిరీలో 1470ర్యాంకు సాధించాడు. ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన రేటింగ్‌లో రతన్ తేజ్‌కు ఉమ్మడి జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకు దక్కింది. దీంతో రతన్‌తేజ్‌ను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్‌కుమార్ నాయుడు, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

4న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17, 19 బాల, బాలికలకు వెయిట్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 4న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అదే రోజు నారాయణ టెన్నిస్ అకాడమీలో సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 7989737474ను సంప్రదించాలని కోరారు.

• ఒకే చెట్టుకు రెండు గెలలు



ఒకే చెట్టులోని రెండు గెలలు

పుట్లూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అరటిచెట్టుకు సాధారణంగా ఒక గెల వస్తుంది. అయితే మండలంలోని రంగరాజుకుంట గ్రామానికి చెందిన రైతు హనుమంతరెడ్డి తోటలో ఒకే చెట్టుకు రెండు గెలలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న మిగతా రైతులు తోటవద్దకు వెళ్లి ఆసక్తిగా గెలలను చూస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ కాండం ఏర్పడిన సమయంలో రెండు అరటిగెలలు వచ్చి ఉంటాయని తెలిపారు. కాగా హనుమంతరెడ్డి ఐదెకరాల్లో అరటి పంటను సాగు చేశాడు.

ఇళ్ల పేరుతో కోట్ల దోపిడీ

- ప్రకాశ్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం
- లబ్ధిదారులకు పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు నిర్మిస్తామని కోట్ల రూపాయల అవినీతి చేసిందే కాకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నావా అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని దుబ్బార్లపల్లిలో పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అంత తోపు అయితే ఐదేళ్లలో ఇళ్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రాక్రీట్ సంస్థ పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీ వందల కోట్లలో ఉందన్నారు. దీనిపై ఇప్పటికే అధికారులు నివేదిక ఇచ్చారని, త్వరలో చర్యలు ఉంటాయన్నారు. నెలకు ఒకసారి వచ్చి కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టి వెళుతున్నాడని అన్నారు. డిజిటల్ బుక్కులకు, బెదిరింపులకు భయపడేదిలేదని తెలిపారు. వీళ్ల మాటలు నమ్మితే అమాయక నాయకులు, కార్యకర్తలు కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

4న పారా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జూనియర్, సబ్‌జూనియర్ పారా స్విమ్మింగ్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 4న నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హతగల పారా స్విమ్మింగ్ క్రీడాకారులు ఈనెల 4న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని, ఎంపిక పోటీలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 9390388169, 8074106154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

- అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన



నిరసనకు దిగిన స్థానిక యువకులు

యాడికి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ కమలపాడు గ్రామానికి చెందిన పలువురు నిరుద్యోగ యువకులు బుధవారం మండలంలోని బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ మండలంలో రెండు సిమెంట్ పరిశ్రమలు, ఒక సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయన్నారు. ప్రస్తుతం మరో సోలార్ ప్రాజెక్ట్ కూడా ఏర్పాటవుతున్నా మండలంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభించక ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపన సమయంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, తర్వాత విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగ యువతకు వలసలు తప్పడం లేదని పేర్కొన్నారు. యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టి అర్హత కలిగిన స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చెట్టు కింద పింఛన్

- ఇబ్బందిపడ్డ వృద్ధులు, దివ్యాంగులు



చెట్టు కింద పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది, టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి పంపిణీ చేయకుండా అందరినీ ఓ చెట్టు వద్దకు రప్పించి పింఛన్ పంపిణీ చేసిన సంఘటన మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బుధవారం జరిగింది. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామంలోని ముళ్ల చెట్టు కింద వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు , దివ్యాంగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. చెట్టు కింద కూర్చోవడానికి కూడా లేకపోవడంతో చాలా సేపు నిలబడాల్సిన వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని వచ్చే నెల నుంచైనా ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయించాలని వారు విన్నవించారు.

ఇంటి వద్దే ఇవ్వాలి: విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

మండలంలో పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిందే. అలాకాకుండా అందరినీ ఒకచోటకు రప్పించి పంపిణీ చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా గ్రామాల్లో ఒకే చోట పంపిణీ చేస్తుంటే మా దృష్టికి తేవాలి. ఉంతకల్లులో జరిగిన విషయం నా దృష్టికి రాలేదు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

15 దాకా ఈ పంట నమోదు గడువు



అనంతపురం అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ ఈ పంట నమోదు గడువును ఈనెల 15 దాకా పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదివరకు సెప్టెంబరు నెలాఖరు దాకా ఈ పంట నమోదుకు గడువు ఉండేది. క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు మందకొడిగా సాగుతుండటంతో ఈనెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

మాది రైతు పక్షపాత ప్రభుత్వం

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- వ్యవసాయ రంగానికి జీఎస్టీ తగ్గింపుపై హర్షం
- నగరంలో ట్రాక్టర్ ర్యాలీ



పచ్చజెండా ఊపి ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు, డీసీఎంఎస్ చైర్మన్ వెంకటేష్

అనంతపురం అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జీఎస్టీ తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలో రైతులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ దాకా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల వ్యవసాయ రంగం అత్యధిక ప్రయోజనం పొందుతోందన్నారు. ఐదారు రోజుల్లో వందల సంఖ్యల్లో ట్రాక్టర్లు కొనుగోలు చేశారన్నారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు తదితరాలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోందన్నారు. గతంలో డ్రిప్ పరికరాలపై 18 శాతమున్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. ఇందులో 2.5 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నా రు. ఈ ఏడాదిలో లక్ష ఎకరాలకుపైగా డ్రిప్, స్ప్రింక్లర్లు అందించినట్లు వెల్లడించారు. కరువు జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ సుధాకర్ రెడ్డి, డ్వామా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్‌నాయక్, వంశీకృష్ణ, సోమశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, మూర్తి, పరమేశ్వరన్, సింగవరం రవి, సుధాకర్ యాదవ్, ఇస్మాయిల్, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచే శిక్షణ

- హాజరుకానున్న 1476 మంది కొత్త టీచర్లు
- మూడు ప్రాంతాల్లో వేదికల ఏర్పాటు
- వసతులపై ఆరాతీసిన కలెక్టర్ ఆనంద్



శిక్షణ ఏర్పాట్లపై డీఈఓ, ఏపీసీతో ఆరాతీస్తున్న కలెక్టర్

అనంతపురం విద్య, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతులను వారంపాటు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలో మూడు ప్రాంతాలలో వేదికలను విద్యాశాఖ, ఎస్ఎస్ఏ శాఖలు ఏర్పాటు చేశాయి. వివేకానంద జూనియర్ కళాశాల(పంగల్‌రోడ్డు), ప్రభుత్వ ట్రైనింగ్ రీజినల్‌సెంటర్ (క్రొరపాడు, బీకేఎస్), విజయభారతి డీఎడ్ కళాశాల (బీకేఎస్)లో శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈశిక్షణకు 1476మంది హాజరవుతారని అధికారులు తెలిపారు. అనంత జిల్లా నుంచి 753మంది ఉండగా, కర్నూలు జిల్లాకు చెందిన 723మందికి ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. విజయభారతి, ప్రభుత్వ రీజినల్‌ట్రైనింగ్‌సెంటర్ ఒక్కో సెంటర్ ఉండగా, వివేకానంద జూనియర్ కళాశాలలో నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశారు. ఏ ఉపాధ్యాయుడు ఏ సెంటర్‌కు వెళ్లాలో ఇప్పటికే సమాచారం పంపా రు. డీఈఓప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కొత్తటీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించే కేంద్రాలను కలెక్టర్ ఆనంద్ బుధవారం పరిశీలించారు. విజయభారతి డీఎడ్ కళాశాలను తనిఖీ చేశారు. అక్కడున్న వసతులు పరిశీలించారు. ఎంతమంది టీచర్లు వస్తున్నారు? వారందరికీ సరిపడా సౌకర్యాలు ఉన్నాయా అని అక్కడి అధికారులతో ఆరా తీశారు. కొత్త టీచర్ల శిక్షణాతరగతులను నిబంధనల మేరకు పక్కాగా నడపాలన్నారు. వసతులు, మెనూ విషయంతో లోపాలు లేకుండా చూడాలని, ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని డీఈఓ, ఏపీసీలకు కలెక్టరు సూచించారు.

వందశాతం హాజరుకావాలి: డీఈఓ

కొత్తటీచర్లు వందశాతం శిక్షణాతరగతులకు హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు ఉండదని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. శిక్షణ తరగతులు ఈనెల 3 నుంచి పదో తేదీవరకు ఉంటాయన్నారు. టీచర్లు శుక్రవారం ఉదయం 7గంటలకు కేటాయించిన కేంద్రాలకు వచ్చి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రతిఅభ్యర్థి ఎంపికైన నియామకపత్రం, లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఫోన్, వారానికి సరిపడా మందులు(అవసరమైనవారు) దుప్పట్లు, దుస్తులు, వ్యక్తిగత వస్తువులు తెచ్చుకోవాలన్నా రు. తమకు కేటాయించిన శిక్షణాకేంద్రాలలోనే తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుత శిక్షణకు హాజరుకానివారు రాష్ట్రస్థాయిలో ఇచ్చే శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌లో ప్లేస్‌మెంట్ అపాయింట్‌మెంట్ ఇస్తామని డీఈఓ పేర్కొన్నారు.

రెండు సొసైటీలకు పీఐసీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (సొసైటీ)లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ)లను నియమించారు. ముద్దలాపురం సొసైటీకి అనంతపురం ఎస్‌డీఎల్‌సీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ నీరజకుమారిని, వజ్రకరూరు సొసైటీకి గుత్తి ఎస్‌డీఎల్‌సీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుజాతమ్మను అధికార పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జీఓ నంబరు 856ను జారీ చేశారు. వీరు వచ్చే ఏడాది జనవరి 30 వరకు పర్సన్ఇన్‌చార్జిలుగా కొనసాగనున్నారు.

మందుబాబు వీరంగం..!



మద్యం మత్తులో కారుపై పడుకున్న వ్యక్తి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం ఫుల్‌గా తాగిన ఓ మందుబాబు జిల్లా కేంద్రంలోని ప్రశాంతిగ్రామ్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. వివరాల్లోకి వెళితే.. బుధవారం ప్రశాంతిగ్రామ్‌లో ఓ యువకుడు మద్యం ఫుల్‌గా సేవించి కదులుతున్న కారుటాప్‌పై పడుకుని రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. కారు కొంత దూరం వెళ్లాక గోడను ఢీకొట్టింది. కారు నడుపుతున్న వ్యక్తికి, కారుపై పడుకున్న మందుబాబుకు ఎలాంటి అపాయం కలగలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పుట్టపర్తి పరసర ప్రాంతాల్లో ఈ మధ్య విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో ఆధ్యాత్మిక కేంద్రానికి సమీపంలోనే మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఆమిదాలకుంట వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాల మేరకు.. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ పురుషుడు బసంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని ఆమిదాలకుంట వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఇతడు మూడు రోజుల నుంచి బసంపల్లి రైల్వేస్టేషన్ చుట్టు పక్కల గ్రామాల్లో యాచిస్తుండేవాడని గ్రామస్థుల ద్వారా తెలిసిందన్నారు. ఆచూకీ తెలిస్తే సెల్ : 9182019510కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ మెడలో బంగారు చైను లాక్కెళ్లిన ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. గత నెల 28న రాత్రి వృద్ధురాలు లక్ష్మమ్మను బెదిరించి మెడలో ఉన్న 18 గ్రాముల బంగారు చైనును లాక్కొని వెళ్లారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈక్రమంలోనే బుధవారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో ఇరువుని అరెస్ట్ చేసి వారి నుంచి 18 గ్రాముల బంగారు చైను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎలా జరిగిందో.. ఏమో?

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మస్తాన్ వలి(ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లాక్ టవర్ ఫ్లైఓవర్ వంతెనపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తపోవనం ప్రాంతానికి చెందిన దూదేకుల మస్తాన్ వలి(32)దుర్మరణం చెందాడు. అనంతపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు నారాయణపురం పంచాయతీలోని తపోవనానికి చెందిన మస్తాన్ వలి నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. భార్య ఆశాతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ద్విచక్రవాహనంపై నగరంలోకి బయల్దేరాడు. అయితే క్లాక్‌టవర్ ఫ్లైఓవర్ వంతెన మధ్యలోకి రాగానే ఎలా జరిగిందో తెలియదు కానీ ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కింద మస్తాన్‌వలి పడ్డాడు. తలపై నుంచి బస్సు వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అదృష్టవశాత్తు ఆయన భార్య ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతపురం ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు

బుక్కట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నారాయణ స్వామి బుధవారం ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. సీఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 50 ఏళ్ల వయసున్న నారాయణ స్వామి.. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. అత్యాచారానికి ఒడిగట్టాడు. కొద్దిసేపటి తరువాత ఏడుస్తూ బాలిక వచ్చింది. దీంతో తల్లి అడగ్గా.. బాలిక మాటలతో ఆమె గ్రహించింది. దీనిపై బాలిక తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు. నారాయణ స్వామి.. పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

రేషన్ డాన్‌లు..!

- అనంతలో పేట్రేగిపోతున్న ఇద్దరు
- డీలర్ల నుంచి బియ్యం
- అసోసియేషన్ నాయకులకూ ముడుపులు
- ప్రతినెలా వంద టన్నులు రవాణా
- పౌరసరఫరాల అధికారులకు ఆమ్యామ్యాలు?



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం అక్రమార్కుల పాలవుతోంది. నిత్యం వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఆ బియ్యం పాలిష్ చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రాష్ట్రాలు దాటి విదేశాలకు సైతం ఆ బియ్యం తరలుతోంది. ప్రజల నుంచే కిలోల లెక్కన పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తుంటారు. టన్నుల లెక్కల్లో డీలర్ల నుంచే అక్రమంగా తరలుతోంది. జిల్లా ఉన్నతాధికారులందరూ ఉన్న అనంతపురం నగరంలో ఈ దందా సాగుతోంది. నగరంలో ఓ ఇద్దరు వ్యక్తులు రేషన్ డాన్‌ల అవతారమెత్తారు. పీడీఎస్ బియ్యం సేకరించి, ఇతర ప్రాంతాల వారికి విక్రయించి రూ.కోట్లకు పడగలెత్తారు. డీలర్ల నుంచి వారికి ప్రతి నెలా తప్పనిసరిగా బియ్యం బస్తాలు వెళ్లాల్సిందేనన్న నిబంధన తీసుకొచ్చారు. అలా అమలు చేసినందుకు ఓ అసోసియేషన్‌లో కీలకంగా ఉన్న వ్యక్తులకు నెల మామూళ్లు కూడా వెళ్తాయట. ఇంతస్థాయిలో దందా జరుగుతుంటే పౌరసరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వారికి కూడా ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

అనతికాలంలోనే..

అనంతపురం రూరల్ మండల పరిధి ఓ గ్రామం కేంద్రంగా వ్యాపారి కేవలం పీడీఎస్ బియ్యం వ్యాపారమే నిర్వహిస్తున్నాడు. మరో వ్యాపారి విద్యుత్‌నగర్ సర్కిల్ సమీపంలో ఉంటాడు. ఇతనూ అదేస్థాయిలో బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఇద్దరూ అనతికాలంలోనే రేషన్ డాన్‌ల అవతారమెత్తారు. పంగల్ రోడ్డులో ఉన్న ఓ వ్యాపారి ఉన్నంత వరకు వీరిద్దరి పేర్లు అంతంత మాత్రంగానే వినిపించేవి. అతడు వ్యాపారం ఆపేసేసరికి ఈ ఇద్దరూ పుంజుకున్నారు. అక్రమ వ్యాపారంలో ఏకంగా కోట్ల రూపాయలు కూడబెట్టారు. వీరికి సంబంధించిన వ్యక్తులు రేషన్‌కార్డుదారుల నుంచే బియ్యం సేకరిస్తుంటారు. కిలో రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేస్తారు. ఇదివరకు తనకు అనుకూలమైన రేషన్ డీలర్ల నుంచే నెలకు 10 నుంచి 20 బస్తాల చొప్పున నేరుగా కొనుగోలు చేసేవాడు. ఈ మధ్యకాలంలో వీరికి బంపర్ ఆఫర్ వచ్చింది. ప్రతి డీలర్ ఆ రేషన్‌డాన్‌కు కనీసం 5 బస్తాలైనా ఇవ్వాల్సిందేనన్న నిబంధన తీసుకొచ్చారట. దీంతో కష్టపడకుండానే అతడి వద్దకు బియ్యం వచ్చి, చేరుతోంది.

డీలర్ల నుంచి బస్తాల బియ్యం

ప్రతి రేషన్ డీలర్.. డాన్‌లకు ఐదు బస్తాలు ఇవ్వాల్సిందే. ఇది కొన్ని నెలలుగా అనంతపురం పరిధిలో వినిపిస్తున్న హెచ్చరిక. ఓ అసోసియేషన్ తరఫున ఇద్దరు వ్యక్తులు చేసిన హుకుంతో డీలర్లందరూ ఆ పని తప్పనిసరిగా చేయాల్సి వస్తోందట. ఇదివరకు కొందరు మాత్రమే అలా విక్రయించేవారు. ఇప్పుడు అందరికీ తప్పనిసరి అయిందని సమాచారం. అనంతపురం పరిధిలో 137, రూరల్‌తో కలిపి 214 వరకు రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో 150 నుంచి 180 పీడీఎస్ ప్యాకెట్లు వచ్చే డీలర్ 5 నుంచి 10 వరకు, 250 నుంచి 300 వరకు ప్యాకెట్లు అందే డీలర్ 25 పీడీఎస్ బస్తాలు అందజేస్తారట. 25 బస్తాలిచ్చే దుకాణాలు నగరంలో, రూరల్‌లో మొత్తం 50కిపైగా ఉన్నట్లు సమాచారం. గతంలో బఫర్ వ్యవహారమంతా ఇదేనని సమాచారం. కిలో రూ.16 నుంచి రూ.18 వరకు డీల్ కుదుర్చుకుంటారని సమాచారం. అంటే 214 దుకాణాల నుంచి సుమారు 2,100 బస్తాల బియ్యం రేషన్‌డాన్‌ల వద్దకు చేరుతోంది. ఇవన్నీ నేరుగా ఆటోలు, ఇతర వాహనాల్లో ఆ ఇద్దరు రేషన్‌డాన్‌ల వద్దకు వెళ్తుంటాయని తెలిసింది. ఆ బియ్యంపై కిలోకు ఇంత పర్సెంటేజీ తీసుకుని కర్ణాటక వ్యాపారులకు విక్రయిస్తుంటారు. వారు అక్కడి నుంచి రూ.40తో ఇతరులకు విక్రయిస్తుంటారని తెలిసింది. అలా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారని సమాచారం.

ఎప్పటి నుంచో..

పీడీఎస్ బియ్యం అక్రమాల వ్యవహారం ఈనాటిది కాదు. అదే రీతిలో అక్రమార్కులు, సంబంధిత అసోసియేషన్ నాయకుల నుంచి అధికార పార్టీ నాయకులకు పంపకాలు వెళ్తుంటాయన్న విమర్శలు లేకపోలేదు. కాంగ్రెస్ హయాం నుంచే ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అప్పట్లోనే ప్రతినెలా రూ.1.50 లక్ష అందజేసేవారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా అధికార పార్టీలో కీలక నేతలకుగానీ, వారి అనుచరులకుగానీ ఆ డబ్బు ముట్టేది. వైసీపీ హయాంలో అసోసియేషన్ నాయకుడు చెప్పిందే వేదంగా మారింది. రేషన్‌డాన్‌ల నుంచో, సంబంధిత అసోసియేషన్ నాయకుల నుంచో ఈ ముడుపులు అందుతుంటాయి. ఎప్పుడూ రేషన్ డీలర్లు తప్పనిసరిగా రేషన్ డాన్‌లకు బియ్యం సరఫరా చేయాలని హుకుం జారీ చేయలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఆ సంప్రదాయం మారిందట. తప్పనిసరిగా ప్రతి డీలర్ ఇవ్వాలని హుకుం జారీ చేశారని వారు వాపోతున్నారు. ప్రస్తుతం కూడా ఓ కీలక వ్యక్తే ఈ వ్యవహారం అంతా తానై నడుపుతున్నట్లు సమాచారం.

సమంగా పంపకాలు...

పీడీఎస్ బియ్యం రేషన్ డాన్‌ల నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేస్తుంటారు. రోజూ క్వింటాళ్ల చొప్పున సరఫరా చేస్తుంటారు. డీలర్లకు కాకుండా అసోసియేషన్‌లో కీలకమైన వ్యక్తులకు అదనంగా కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందట. దీంతో ఇక్కడ పీడీఎస్ బియ్యం కిలో కొనుగోలు ధర రూ.24కి చేరుకుంటుంది. ఇక్కడ మరో చిక్కు ఉంది. ఆ అసోసియేషన్‌లో రెండు వర్గాలు అయ్యాయట. ఓ వర్గం అనంతపుర రూరల్ పరిధిలోని రేషన్‌డాన్‌కు, మరో వర్గం విద్యుత్‌నగర్ సర్కిల్ సమీపంలోని మరొకరికి డీలర్ల నుంచి బియ్యం సరఫరా చేయిస్తున్నాయట. ఒక్కో డీలర్ నుంచి బియ్యం అందజేసినందుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు కమీషన్ ఉంటుందని సమాచారం. మొత్తం దుకాణాల నుంచి ప్రతినెలా రూ.2.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు సమాచారం.

పౌరసరఫరాల శాఖ ఏం చేస్తున్నట్లు..?

సామాన్య ఉద్యోగి నుంచి కలెక్టర్ వరకు ఉన్న జిల్లా కేంద్రంలో ఇంత దందా జరుగుతుంటే బాధ్యత కలిగిన పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ అక్రమ వ్యవహారం తమకేమీ తెలియదన్నట్లు ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. అనంతపురం, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో కీలక అధికారులు, సంబంధిత డిప్యూటీ తహసీల్దార్లకు ప్రతినెలా పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నట్లు సమాచారం. వారేం చేసినా అడగకుండా ఉండేందుకు పౌరసరఫరాల శాఖలో ఓ ఉన్నతాధికారికి సైతం ప్రతినెలా ఆమ్యామ్యాలు ముడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు.. పేదల బియ్యం అక్రమార్కుల పాలుకాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



అన్ని చెరువులకు నీరిస్తాం

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ర్యాలీలో ఎమ్మెల్యే కందికుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలతో హంద్రీ-నీవా కాలువల ద్వారా అన్ని చెరువులకు నీరందిస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడిపారు. పెద్దచెరువు కట్టపై నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయకట్టు చెరువైన ధనియానిచెరువును కూడా నీటితో నింపుతామని హామీ ఇచ్చారు. సామాన్యుడికి నిత్యావసర వస్తువులు అందుబాటులోకి రావడానికి జీఎస్టీ తగ్గించారని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, ఎరువులు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గడంతో చాలా వరకు ఆదా అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించారని గుర్తు చేశారు. ప్రతినెలా 1న పింఛన్లు ఎలా ఇస్తున్నామో.. ఉద్యోగులకు కూడా అదే రోజున జీతాలు పడుతున్నాయని తెలిపారు. కదిరి నియోజకవర్గ పరిశీలకుడు వహీద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, తహశీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారధి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, దండే రవి శంకర్, నరసింహులు, హనుమంతరెడ్డి, రామాంజులు, నరసింహారెడ్డి, అంజనప్పనాయుడు, బీజేపీ నాయకులు రామ్మోహన్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్‌కు సంబంధించి ఎస్‌జీఎఫ్ (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) జిల్లా జట్లను ఎంపిక చేశారు. అండర్-14, 17, 19 బాల, బాలికలకు బాక్సింగ్ జిల్లాస్థాయి సెలెక్షన్స్ బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డీఎస్‌డీఓ మంజుల ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు.

అండర్-14 బాలుర విభాగంలో..

లక్ష్మీనారాయణ, ఓబులేసు, షెక్షావలి, సమీర్, శివబాలాజీ, రవీంద్ర, మేఘనాథ్, పవన్‌కుమార్, అవినాష్, సందీప్, మహీధర్ ఎంపికయ్యారు.

అండర్-17 బాలికల విభాగంలో..

నందిని, బిందు శ్రీ, గీతాంజలి, సాయిశ్రీ, నీలావతి, ఆశీర్వాద, రేణిక, బిందు, సింధు, వసంతలక్ష్మి, తనూషా, అంజలి, వసంత, మేఘన ఎంపికయ్యారు.

బాలురలో..

హర్షవర్ధన్, మణికంఠ, వైష్ణవ్‌కుమార్ రెడ్డి, రవితేజ, భరత్‌కుమార్, సుదర్శన్, లక్షిత్‌చౌదరి, మనోజ్, చక్రి, విజయ్‌కుమార్, కిశోర్‌నాయక్, ఉమర్ ఎంపికయ్యారు.

అండర్-19 బాలురలో..

నూర్ మహ్మద్, మణికంఠ, తేజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, గణేష్, చరణ్, హర్షవర్ధన్‌రెడ్డి, అర్సలామ్, అబీద్, విజయ్‌సింహా రెడ్డి, నంద కిశోర్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో..

ప్రత్యూష, హేమావతి, షహీనా, నందిని, అఖిల, రేవతి, భవిజ్ఞ, స్నేహలత ఎంపికయ్యారు. వీరు ఈనెల 5వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, శ్రీవాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డబ్బులిచ్చినా బిల్లు పెట్టవా..!

- హౌసింగ్ ఏఈని నిలదీసిన లబ్ధిదారుడు



హౌసింగ్ ఏఈని నిలదీస్తున్న లబ్ధిదారుడు

రొద్దం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణం కోసం రూ.1500 డబ్బులిచ్చినా బిల్లు చేయవా అంటూ హౌసింగ్ ఏఈ ఖాజామోయినుద్దీన్‌ను రామలింగప్ప, ఆయన భార్య పార్వతమ్మ నిలదీశారు. బుధవారం చెరుకూరు గ్రామంలో మంత్రి సవిత పింఛన్ల పంపిణీలో పాల్గొనగా లబ్ధిదారుడి భార్య పార్వతమ్మ రూ.3 లక్షలు అప్పుచేసి ఇల్లు కట్టుకున్నా బిల్లు చేయలేదని హౌసింగ్ అధికారులపై ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న హౌసింగ్ ఏఈ లబ్ధిదారుడు రామలింగప్ప ఇంటివద్దకు వెళ్లగా.. రూ.1500 డబ్బులిచ్చాం, ఎందుకు బిల్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకెప్పుడిచ్చారని ఏఈ బుకాయించగా.. మరో మహిళ వచ్చి మీరే కదా ఇంటి బిల్లు కోసం ఫొటో తీసుకుని బిల్లు పెడతామని రూ.1500 తీసుకున్నారని వాదించింది. బిల్లులైతే పెట్టాం.. ఎవరికీ పడలేదంటూ అక్కడి నుంచి ఏఈ వెళ్లిపోయారు. హౌసింగ్ లబ్ధిదారులకు వివిధ దశల్లో బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బిల్లులు రాకనే లబ్ధిదారుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసుకుని స్వాహాచేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఈ ఖాజామోయినుద్దీన్‌ను వివరణ కోరగా.. వారు డబ్బులు ఎవరికి ఇచ్చారో తనకు తెలియదని తెలిపారు.

బత్తలపల్లిలో హిజ్రాల హల్‌చల్

రూ.20వేలు ఇవ్వలేదని శాపనార్థాలు.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

బత్తలపల్లి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం హిజ్రాలు హల్‌చల్ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. బత్తలపల్లిలోని ధర్మవరం రోడ్డులో వినయ్‌కుమార్ అనే వ్యక్తి శ్రీలక్ష్మి ఎంటర్ ప్రైజస్ షాపును నిర్వహిస్తున్నాడు. బుధవారం ఇద్దరు హిజ్రాలు వెళ్లి దసరా మామూలు ఇవ్వాలని కోరారు. షాపు యజమాని రూ.500 ఇస్తుండగా.. రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని, వెయ్యి రుపాయలు తీసుకోవాలని ఇచ్చాడు. రూ.20వేలు ఇస్తేనే కదులుతామని, లేదంటే కదిలేదిలేదని.. నానా దుర్భాషలాడుతూ శాపనార్థాలు పెట్టారని బాధితుడు వాపోయాడు. బత్తలపల్లిలో రోజురోజుకు హిజ్రాల ఆగడాలు ఎక్కువవుతున్నయని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక షాపు వద్ద హల్‌చల్ చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఇన్‌స్పైర్‌కు 1269 నామినేషన్లు

కొత్తచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్‌కు 1269 నామినేషన్లు వచ్చినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 354 పాఠశాలలకు గాను 326 పాఠశాలలు ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులకు సంబంధించి నామినేషన్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా నమోదు చేసుకున్నారని అన్నారు. ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను, వారికి సహకరించిన ఉపాధ్యాయులను డీఈఓ క్రిష్ణప్ప, జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ అభినందించారు.

రైతన్నకు చోర భయం

అన్నదాతలు, ట్రాన్స్‌కోకు తీవ్ర నష్టం

వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న దొంగలు

కాపర్‌వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

తలుపుల సమీపాన దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్



కదిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కాపర్ వైరు కోసం దొంగలు రాత్రి సమయాల్లో రోడ్డు పక్కన పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు. దీంతో తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకునే వరకు పొలాలకు నీటితడి ఇవ్వలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ట్రాన్స్‌కో కూడా బాగా నష్టం కలుగుతోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైరు, ఇతరత్ర సామగ్రిని చోరీ చేసి అమ్మితే దాదాపు రూ.20వేల వరకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో జల్సాలకు అలవాటు పడిన కొందరు దీన్ని ప్రధానం ఎంచుకున్నట్లు సమాచారం. కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు జరుగుతున్నాయి. గడచిన మూడు నెలల్లోనే దాదాపు 10కిపైగా ట్రాన్‌ఫార్మర్‌లను పగులగొట్టి కాపర్ వైర్ చోరీ చేశారు.

చోరీల్లో కొన్ని..

- రెండు రోజుల కిందట తలుపుల సమీపంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టారు. శ్రీసాయి పాఠశాలకు సమీపంలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వసం చేశారు. గ్రామ శివారు జగనన్న కాలనీలో ఉండే మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి దాదాపు 90 కేజీల కాపర్ వైరు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబరు 18న నల్లమాడ మండలంలోని మసకవంక పల్లిలో దొంగలు రెండు ట్రాన్స్‌ఫార్మరలను పగులగొట్టి కాపర్‌వైర్ ఎత్తుకెళ్లారు. రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- మే25న ఓడీసీ మండలం గొల్లవారిపల్లిలో రైతు చేతన్‌ప్రకాష్ పొలంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి కాపర్ వైర్ చోరీ చేశారు.
- గాండ్లపెంట పరిధిలో రైతు చెన్నారెడ్డి పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని పగలగొట్టి కాపర్‌వైర్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబరు 26న తనకల్లు మండలం గంగసానిపల్లి వద్ద రైతు లక్ష్మీనారాయణ పొలంలో ట్రాన్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో చోరీకి వచ్చిన వెంకటరమణప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎన్ని అగచాట్లో..



నల్లమాడ మండలంలోని మసవంకపల్లి వద్ద ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు

పొలం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలంటే ఎన్ని అగచాట్లు పడా లో అవి అనుభవించిన రైతులకే తెలుస్తుంది. తొలుత పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయించాలి. ఇది చేయించడానికి రైతులు మరిన్ని తిప్పలు పడాల్సి వస్తుంది. కొన్ని పోలీస్ స్టేషన్‌లలో ఎఫ్ఐఆర్ చేయడానికి ఎస్ఐలు ససేమిరా అంటున్నారు. ఎఫ్ఐఆర్ అయిన తరువాత ఆ కాపీని విద్యుత్ అధికారులకు అందజేయాలి. వారు పరిశీలించి క్రమ సంఖ్య అధారంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను కేటాయిస్తారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రావడానికి ఎన్ని నెలలు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఈలోపు పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది.

నిఘా పెంచుతాం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలపై నిఘా పెంచుతాం. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తూ ఒక దొంగ దొరికాడు. మిగిలిన వారికోసం గాలింపు ముమ్మరం చేశాం. త్వరలోనే ఈ చోరీలకు అడ్డుకట్ట వేస్తాం.

-శివనారాయణస్వామి, డీఎస్పీ

రైతుకు కష్టం..

రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పగులకొడితే రైతుకు పెద్ద కష్టం, ట్రాన్స్‌కో నష్టం జరుగుతుంది. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ విలువ దాదాపు రూ.1.4 లక్షలు ఉంటుంది. అదే 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.90వేల వరకు ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ పగులగొడితే అందులో ఉండే కాపర్ విలువ రూ.20 వేల కంటే ఎక్కువ చేయదు. దొంగలు కాపర్ కరిగించి అమ్ముకుంటునట్లు తెలిసింది. కొన్ని సార్లు దీన్ని రూ.5 వేల నుంచి 10వేలకు కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ పగుల గొడితే విద్యుత్ సౌకర్యంలేక, బోరుబావుల్లో నీరు రాక పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ట్రాన్స్‌కో కూడా పెద్ద ఎత్తున నష్టం కలుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు ఇంటి దొంగల పనే అని పోలీస్ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. ట్రాన్స్‌కోలో అనధికారంగా పనిచేసిన వారు కొంతమంది ఈ దొంగతనాలకు పాల్పడినట్లు వారు అభిప్రాయపడుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్న దొంగలను పోలీసులు పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు


అమ్మవారిని దర్శించుకుంటున్న మౌర్య, సందీప్

బత్తలపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామిక వేత్త సందీప్, సినీ నటుడు మౌర్య శ్రీనాథ్‌గౌడ్ బత్తల పల్లిలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ, నాయకులు పురుషోత్తంచౌదరి, రంగానా యుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ధర్మవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తుంపర్తి పరమేష్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డీసీసీ అధ్యక్షుడు ఇనయతుల్లా ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కాలేజ్ సర్కిల్‌లో సంతకాల సేకరణ, ఓట్ చోర్ - గద్దెచోడ్ కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. వామపక్ష నాయకులు మునుగు మధు, పోలా లక్ష్మీనారాయణ, నాగార్జున, నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు దాదు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అనాథ బాలుడిని చేరదీసిన సీఐ

కొత్తచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మరణించడంతో అనాథగా రోడ్డుపై తిరుగుతున్న పన్నెండేళ్ల బాలుడిని సీఐ మారుతీశంకర్ చేరదీశారు. ఆ బాలుడు బుధవారం మం డల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో అటు ఇటు తిరుగుతుండగా సీఐకి అనుమానం వచ్చి దగ్గరకు పిలిచి విచారించాడు. మండల కేంద్రానికి చెందిన తల్లిదండ్రులు మృతిచెందారని, తనకు ఎవరూ లేరని ఆ బాలుడు తెలిపాడు. ఎవరైనా అన్నంపెడితే తిని షాపుల వద్ద, ఆలయాల వద్ద ఉంటున్నానని బాలుడు సీఐతో తెలిపాడు. దీంతో సీఐ ఆ బాలుడిని చేరదీశాడు. అనంతపురంలోని చైల్డ్ వెల్ఫేర్ సిబ్బందికి అప్పగిస్తామని సీఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

గాండ్లపెంట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు. మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ పాయకట్టు గ్రామానికి చెందిన బాలిక కొద్ది రోజుల క్రితం అమ్మమ్మ ఊరు అయిన గొడ్డువెలగల పంచాయతీ గుండెవారిపల్లి వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు ఈ 29వతేదీన అక్కడ బయలు దేరింది. అయితే ఇంటికి రాలేదు. ఈ మేరకు బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ - ఇద్దరికి గాయాలు

నల్లచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల క్రేందంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కదిరి వైపు వెళ్తున్న రెండు ద్విచక్రవా హనాలను, మదనపల్లి నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో గోరంట్ల వారిపల్లికి చెందిన సునీల్, అనంతపురానికి చెందిన రవీంద్ర గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ద్విచక్ర వాహన దారుడు తన బైకును ఆపకుండా కదిరి వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మగ్బూల్ తెలిపారు.


మహిషాసుర మర్దినిగా ధర్మవరం షిర్డీసాయి ఆలయంలో త్రిపురసుందరీదేవి


ముదిగుబ్బలోని వాసవీ మాత


కొత్తచెరువులోని అలివేలమ్మ


అమడగూరులో చౌడేశ్వరి

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్ వర్క్)

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మామిళ్ల కుంట కూడలిలోని లలితాంబ మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఎనుమలపల్లి దుర్గామాత, ప్రశాంతినిలయంలో గాయత్రిమాత, జిల్లా కేంద్రంలోని సత్యమ్మ, వాసవీమాత, కోవెలగుట్టపల్లి దుర్గాదేవి మహిషాసురమర్దినిగా దర్శమిచ్చారు. ధర్మవరం పట్టణంలోని టీచర్స్ కాలనీ చౌడేశ్వరి సిద్ధిధాత్రిగా, గాంధీనగర్ చౌడేశ్వరి మహిషాసురమర్దినిగా, రాంనగర్ చౌడేశ్వరిదేవి మహాచండిగా అనుగ్రహించారు. కొత్తపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి దేవి లలితగా, సాలేవీధి పెద్దమ్మ, షిర్డీసాయి ఆలయంలో త్రిపుర సుందరీదేవి మహిషాసురవర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తచెరువులో నాగులకనుమ వద్ద అలివేలమ్మ, అమడగూరు చౌడేశ్వరి, ముదిగుబ్బ వాసవీమాత మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. కొత్తచెరువులోని రేణుకా యల్లమ్మ, పెద్దమ్మ, వాసవీ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.


పుట్టపర్తిలోని వాసవీ మాత

జీఎస్టీ తగ్గింపుపై తెలియజేయండి

● ఎమ్మెల్యే కందికుంట


పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను అందరికీ తెలియజేయాలని ప్రభుత్వ ఉద్యోగులు, పార్టీ నాయకులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. స్థానిక 33వ వార్డులో తలుపుల మండలం కురుగుట్టపల్లెలో ఆయన బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందుతున్నా యన్నారు. ఈ విషయాలను పార్టీ నాయకులు, అధికారులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జీ ఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు కలగడమే కాకుం డా వ్యాపారాలు ఊపందుకుంటాయని అన్నారు. హంద్రీ నీవా ద్వారా తలుపుల మండలంలోని అన్ని చెరువులకు నీరందిస్తామని తెలిపారు. కాలువ లైనింగ్ పనులు త్వరలో చేపడతారని తెలిపారు. సామాజిక బాధ్యత కింద ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని పేర్కొన్నారు. అనర్హుల పింఛన్లు తొలగిస్తే అందుకు వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టారని తెలిపారు. అనర్హులకు పింఛన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు వాజీద్, రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ బాను, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, వార్డు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆయన తలుపు ల మండలంలో హంద్రీ-నీవా కాలవను , కొండారెడ్డి చెరువుకు నీరు పారే కాలువులను పరిశీలించారు.

ట్రాక్టర్లతో ర్యాలీ

అమడగూరు(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు కూటమి నాయకులు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించినట్లు ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. వ్యవసాయ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు గురించి రైతుల కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శరత్ కుమార్‌రెడ్డి, వేమనారాయణ, సుబ్బిరెడ్డి, సురేంద్ర రెడ్డి, హైదర్‌వలి, నంజిరెడ్డి, గంగులప్ప, ఏఈఓ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ధర్నా

తనకల్లు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మండల పరిధిలోని కంసానివారిపల్లి వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తనకల్లులోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నాపంచాయతీ అధికారులు, సర్పంచు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కదిరివాసుల ఎంపిక

కదిరి అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కదిరి క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ షేక్షా తెలిపారు. అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం ఎస్‌జీ ఎఫ్‌ఐ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కదిరి క్రీడాకారులు డింపుశ్రీ, ఆశీర్వాద్, నూర్ మహమ్మద్ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఏడాదిలో చెరువులన్నీ నింపాలి: కలెక్టర్

పుట్టపర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడాదిలోగా అన్ని చెరువులను నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్ సమావేశ భవనంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న చిన్న, మధ్య తరహా చెరువులను హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో నీటి సంరక్షణ సంఘాలను ఏర్పాటుచేయాలన్నారు కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గురుమూర్తి, డీఈ గంగాద్రి, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ శ్రీలక్ష్మి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ రాజాస్వరూప్, డీఈ మురళి తదితరలు పాల్గొన్నారు.

గంజివారిపల్లి పంచాయతీ ఏర్పాటుకు వినతి


ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కదిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని వేపమానిపేట పంచాయతీని విభజించి గంజివారిపల్లి కేంద్రంగా కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు ఎంపీడీఓ నసీమాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గంజివారిపల్లి, కొత్తపూలవాండ్లపల్లి, ఎస్సీ కాలనీలు, బోయపల్లి, గుర్రంగుండ్లపల్లి తదితర గ్రామాల ప్రజలు గ్రామ పంచాయతీ కేంద్రమైన వేపమానిపేటకు అధికారిక పనుల నిమిత్తమై రావాలంటే పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉందన్నారు. కొత్తపూలవాండ్లపల్లి నుంచి పంచాయతీ కేంద్రానికి రానుపోను సుమారు 28 కిలోమీటర్ల ఉందన్నారు. డైరెక్ట్‌గా బస్సు లేదన్నారు. దీంతో ఇటీవల ఓటింగ్ శాతం గణనీయంగా పడిపోయిందన్నారు. కావున కొత్తపూలవాండ్లపల్లి, ఎస్సీ కాలనీ, గుర్రంగుండ్లపల్లిని కలిపి గంజివారిపల్లి కేంద్రంగా కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని దాదాపు 400 మంది గ్రామస్థులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. గ్రామస్థులు అక్బర్, బాబు, శీన, ముస్తఫా, వెంకటేష్, ఫక్రుద్దీన్, రాజేష్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ పింఛన్లు'

ధర్మవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తోందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్రకుమార్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని ఇందిరానగర్, పీఆర్‌టీ వీధులలో బుధవారం పింఛన్ల, స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల 20ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. అటువంటి రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నాలుగో స్థానంలో నిలిపిందని అన్నారు. వైసీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలు అమలు కావడంలేదని వారి రోతపత్రికలో గగ్గోలు పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా 25వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, వార్డు కమిటీ ఉపాధ్యక్షుడు చీమల రామాంజి, కొత్తపేటలో టీడీపీ నాయకులు కొత్తపేట ఆది తదితరులు పింఛన్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మదీనామసీదు కమిటీ అధ్యక్షుడు నాగూర్‌హుస్సేన్, నాయకులు రామకృష్ణ, ఈశ్వరయ్య, బీరే శీన, అనిల్ పాల్గొన్నారు.



హిందూపురంలోని అష్టలక్ష్మి ఆలయంలో నాణేలతో అలంకరణ



హిందూపురంలో వేదవల్లిగా దర్శనమిస్తున్న కొల్హాపురి లక్ష్మీమాత



పురంలో వారాహి రూపంలో కనువిందు చేస్తున్న బోయకొండ గంగమ్మ



పురుషోత్తముడి రూపంలో పేట వెంకటరమణ స్వామి



గోరంట్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు



లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి



మడకశిరలో తులసీ దళాలతో వడిసలమ్మకు ప్రత్యేక అలంకరణ



పరిగిలో సప్తమాతృక అమ్మకు మహిషాసుర మర్దిని అలంకరణ



హిందూపురంలో రాజరాజేశ్వరిగా యల్లమ్మదేవి



దసరా పండుగ సందర్భంగా కిటకిటలాడుతున్న హిందూపురం పూల మార్కెట్



పూజాసామగ్రిని తీసుకెళ్తున్న యువతి

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ

లేపాక్షి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకుని లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవిని పదోరోజు మహిషాశురమర్దినిగా అలంకరించారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాహిమాం... పరమేశ్వరీ..

హిందూపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పాహిమాం.. పరమేశ్వరి అంటూ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరణ చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

ఘనంగా ఆయుధపూజ

రొద్దం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా పండగను పురస్కరించుకుని బుధవారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. రైతులు ట్రాక్టర్లు, గుంటకలు తదితర వాటిని శుభ్రంచేసి అలంకరణచేసి పూజ నిర్వహించారు. వ్యాపారస్థులు దుకాణాల్లో ఆయుధపూజ నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

గోరంట్ల అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు చేపల నరసంహప్ప, గావాచి నరసింహప్ప అనారోగ్యానికి గురాయ్యరు. విషయం తెలుసుకున్న నాయకులు ఒక్కొక్కరికి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడు బెల్లాల చెరువు చంద్ర పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

అమరాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దనకుంట గ్రామంలో నవనిర్మాణ యువసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు యువసేన సభ్యులు తెలిపారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఎముకలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నిఘా ఉంచండి: ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

హిందూపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నేరస్థులపై పోలీసులు నిత్యం ఓ కన్నేసి ఉంచాలని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సీడీ ఫైల్స్, యుఐ కేసుల రికార్డులను చూశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కానిస్టేబుల్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పూర్తీచేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రతి వారం వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. చోరీ కేసుల్లో ప్రాపర్టీ రికవరీ శాతం పెంచాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, కరీం, ఎఎస్‌ఐలు పాల్గొన్నారు.

శిక్షణ కోసం కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

హిందూపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు బిట్ కళాశాలలో కేంద్రాన్ని డీఈఓ కిష్టప్ప పరిశీలించారు. బుధవారం స్థానిక ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, శేషాచలంతో కలిసి బిట్ కళాశాలలో ఈనెల 3 నుంచి 10 వరకు జరిగే శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి ప లు సూచనలు చేశారు. ఎనిమిది రో జులపాటు కొత్త ఉపాధ్యాయులకు విద్యార్థులకు బోధించే విధానం ప్రస్తుతం విద్యాశాఖలో అమలవుతున్న విషయాలపై తెలియజేయాలన్నారు.





పింఛన్లు పంపిణీ చేస్తున్న కొల్లకుంట అంజినప్ప, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప

పురంలో 93 శాతం పింఛన్లు పంపిణీ

హిందూపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఉదయం నుంచే పింఛన్లను ఆయా వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. సాయంత్రం 7గంటల సమయానికి హిందూపురం పట్టణం 93శాతం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. లేపాక్షి 93.75శాతం, చిలమత్తూరు 93.25శాతం, గోరంట్ల 93శాతం, పెనుకొండ 93శాతం, పరిగి 94శాతం, సోమందేపల్లి 94శాతం, రొద్దం 94శాతం పంపిణీ చేశారు. హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంటలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప పింఛన్లు పంపిణీ చేయగా, గోరంట్లలో మాజీ మంత్రి నిమ్మలకిష్టప్ప అందజేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

గుడిబండ, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రత్యేక అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. శంకరగల్లు రూ.5516, రాళ్లపల్లి రూ.8904, చిగుతుర్పి రూ.6వేలు, కొంకల్లు రూ.6494, జమ్మలబండ రూ.20,354, జి.మోరుబాగల్ రూ.9258, దేవరహట్టి రూ.10,554, తాళికెర రూ.20,500, మండలపల్లి రూ.4541, ముత్తుకూరు రూ.6635, గుడిబండ రూ.12,500, కెఎన్‌పల్లి రూ.10,795, కరెకెర రూ.6100, సిసిగిరి 16,660, మోరుబాగాల్ రూ.7464, ఎస్ రాయాపురం రూ.7వేలు ఉపాధి నిధులు పక్కదారి పట్టడంతో నిగ్గుతేల్చారు. ఈ నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఏపీసీ అసిస్టెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీఓ జగదీశ్,ఈసి జగదీశ్, ఎస్ఆర్పీ భాస్కర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై విషం కక్కుతున్న వైసీపీ

-మంత్రి సవిత



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సవిత

రొద్దం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ విషం కక్కుతోందని మంత్రి సవిత విమర్శించారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిషలు కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిన వైసీపీ నాయకులు అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కంది రైతులకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. త్వరలోనే పేదలకు పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరహరి, రామచంద్ర, తిరుపాల్‌నాయుడు, మారెప్ప, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్, శ్రీనాథ్‌చౌదరి, చిన్నమంతూరు పవన్, నాగరాజు, చౌడప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారులపై ఆగ్రహం

రొద్దం, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారులపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరుకూరు గ్రామంలో మంత్రి సవిత ఇంటింటికి పింఛన్ల పంపిణీ చేశారు. చెరుకూరు హరిజనవాడలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మంత్రి సవితకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రాధాదేవిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు ఇస్తున్నా సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ, ఈఓఆర్డీ తెలిపారు. ఇదే పునరావృతం అయితే సస్పెండ్ చేస్తామని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తి, క్షేత్ర సహాయకుడు అనీల్‌కుమార్, టీడీపీ నాయకులు నాగరాజు, మాజీ సర్పంచ్ కిష్టప్ప, అంజి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయండి: ఏపీటీఎఫ్

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు మంత్రి సవితకు బుధవారం వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, చంద్ర, ఉపాధ్యాయులు మంత్రితో సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పెనుకొండ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, వెంకటరమణనాయక్, రొద్దం మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, సోమందేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు శివన్న, గణేష్, రఘునాథ్‌రావు, అమీర్‌వలి, ఫణీంద్రనాథ్, హరిప్రసాద్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా తన నివాసంలో ఆయుధపూజ కార్యక్రమాన్ని మంత్రి సవిత నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొద్దం, (ఆంధ్రజ్యోతి): శేషాపురం బీసీ కాలనీలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత డీఎల్‌పీఓకు సుమన జయంతిని ఆదేశించినట్లు తెలిసింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో బురదమయంగా బీసీ కాలనీ కథనానికి స్పందించిన మంత్రి డ్రైనేజీలు, సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మడకశిర టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డులో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామి కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో చంద్రబాబుకు సాటి ఎవరు లేరన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కమీషనర్ జగన్నాథ్, వైస్ చైర్మన్ ప్రభావతి, వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తన క్యాంపు కార్యాలయ ఆవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలసి పంపిణీ చేశారు. 67 మంది లబ్ధిదారులకు రూ. 21.30 లక్షల చెక్కులు పంపిణీ చేశారు సీఎం చంద్రబాబు అటు అభివృద్ధి ఇటు సంక్షేమం దిశగా ముందుకుసాగుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, మైనార్టీ డైరెక్టర్ భక్తర్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, నాయకులు డాక్టర్ క్రిష్ణమూర్తి, కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చందకచర్ల గ్రామంలో గంగమ్మదేవత ఆలయంలో జరుగుతున్న చండీహోమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రత్నగిరి గ్రామానికి చెందిన ఏడవ వార్డు మెంబర్ రామక్రిష్ణ, మడకశిర తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న, ఒక్కళిగ కన్వీనర్ పాండురంగప్ప పాల్గొన్నారు.